సాక్షి సూర్యాపేట

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



మట్టి గణపతికి జై..
కోదాడలో మట్టి గణపతులను తయారుచేస్తూ పర్యావరణ ప్రేమికుల మన్ననలు పొందుతున్నారు.
- 8లో



నాణేలు ఇస్తామని టోకరా
పురాతన బంగారు నాణేలను తక్కువ ధరకు ఇస్తామని ఓ వ్యాపారికి ముఠా సభ్యులు టోకరా పెట్టారు.
- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	585.10 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,50,006 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,50,006 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,576 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,387 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,601 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాయలంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యా హవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కాగా క్షేత్రంలోని శివాలయంలోగల శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వకేకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

సీపీఎస్‌తో సామాజిక భద్రత లోపించింది

నేరేడుచర్ల: సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)తో ఉద్యోగులకు సామాజిక భద్రత లోపించిందని తెలంగాణ టేకెన్ ఓవర్ కళాశాలల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంకెన కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీఓ 28ని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఈ పెన్షన్ పథకంలో మార్పులను సూచించేందుకు 2023 మార్చిలో టీవీ సోమనాథన్ కమిటీని నియమించగా ఆ కమిటీ సిఫార్సుల మేరకు యునైటెడ్ పెన్షన్ స్కీంను అదే సంవత్సరం ఆగస్టు 24న కేంద్రం ఆమోదించినా అమలు చేయలేదన్నారు. ప్రతి నెలా షేర్ మార్కెట్‌కు ఎన్‌పీఎస్ ద్వారా రాష్ట్రం నుంచి రూ.600 కోట్లు తరలివెళ్తున్నాయని, రాష్ట్రంలో వసూలు చేసిన రూ.10.50లక్షల కోట్ల వరకు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తున్నాయన్నారు. ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాటించాలన్నారు.

బీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట : బీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్ అని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు భద్రబోయిన సైదులు పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం వద్ద బీపీ మండల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు, బీసీలకు స్ఫూర్తిగా, ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. బీపీమండల్ కలలుగన్న సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యాదవ రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్ , తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాగం రాజశేఖర్ యాదవ్, బీసీ జేఏసీ నాయకులు మదనాచారి, నాగేంద్రబాబు, శ్యామ్, ముత్యం నాగేంద్ర బాబు, కూరాకుల శ్యామ్, కిరణ్, కొమ్ము నాగయ్య, నరేష్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో కేంద్రం వివక్ష

సూర్యాపేట అర్బన్: తెలంగాణకు కావాల్సినంత యూరియా సరఫరా చేయడంలో కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఒక ప్రకటలో విమర్శించారు. నెలరోజులుగా నాట్లు వేసిన రైతులు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీలకు వచ్చిన యూరియాను అధికార పార్టీ నాయకులు, సొసైటీ డైరెక్టర్లు స్వాధీనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్ ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.

'పవిత్ర' వృత్తికి జాతీయ గుర్తింపు



ఉపాధ్యాయురాలు పవిత్ర

- జీవశాస్త్రం టీచర్ పవిత్రకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- రాష్ట్రం నుంచి ఈమె ఒక్కరే ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ వర్గాలు

సూర్యాపేటటౌన్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మారం పవిత్ర జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆమె రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ స్థాయికి ఆరుగురు దరఖాస్తు చేసుకోగా సూర్యాపేట జిల్లాకు చెందిన మారం పవిత్రకు ఒక్కరికే ఈ అవార్డు రావడం పట్ల పలువురు సైన్స్ టీచర్లు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో 45 మంది ఆయా రాష్ట్రాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా అందులో పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మారం పవిత్ర ఎంపిక కావడం విశేషం.



ప్రయోగ బోధనతో ఆకట్టుకునేలా...

మారం పవిత్ర ఏ స్కూల్‌లో పనిచేసినా ఆమె విద్యార్థులకు అర్థవంతంగా బోధిస్తూ వారి చేతనే తగిన ప్రయోగాలు చేయిస్తారు. విద్యార్థుల ఉన్నతికి ఆమె చేస్తున్న కృషి గుర్తించి ఇప్పటికే పలు అవార్డులు ఆమె సొంతమయ్యాయి. విద్యార్థులతో ఎన్నో రకాల ప్రయోగాలు చేయించి సైన్స్‌ఫెయిర్‌లలో రాష్ట్ర స్థాయికి తమ ఎగ్జిబిట్లను తీసుకెళ్లారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా సైతం ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు బోధించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తనదైన శైలిలో ప్రయోగ బోధనలు అందిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు.

ఎగ్జిబిట్‌తో విద్యార్థినులు, టీచర్ పవిత్ర

రెండో దశకు ఎప్పుడు?

- ఎస్సారెస్పీ నీటి విడుదలలో తాత్సారం
- ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయమూ తీసుకోని అధికారులు
- జిల్లాలో 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు
- రైతులకు తప్పని ఎదురుచూపులు



జిల్లాకు ఎస్సారెస్పీ నీటిని అందించే ప్రధాన కాలువ (ఫైల్)

భానుపురి (సూర్యాపేట) : వానాకాలం సీజన్‌లో ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టుకు సాగునీటి విడుదలపై అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి గేట్లు ఎత్తినప్పటికీ రెండో దశ కింద 2.20లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదల చేయకపోవడంపై జిల్లాలోని రైతాంగం ఆందోళన చెందుతోంది. ముఖ్యంగా ఎస్సారెస్పీ నీటిపైనే ఆధారపడి పంటలు సాగు చేసే తుంగతుర్తి, సూర్యాపేట నియోజవర్గాల రైతులకు ఎదురు చూపులు తప్పడంలేదు.

2.20 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఎస్సారెస్పీ రెండో దశ కింద తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 2018 నుంచి ఎస్సారెస్పీ ద్వారా గోదావరి జలాలతో వరుసగా ఏటా రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నారు. గత ఏడాది వర్షాలు ఆలస్యం కావడమే కాకుండా నీటి విడుదలలోనూ జాప్యం చేశారు. ఈసారి కూడా మొదట్లో ఎక్కువ గోదారికి సరైన వర్షాలు లేకపోగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీ పూర్తిస్థాయిలో నిండి గేట్ల ద్వారా గోదావరి జలాలను నదిలోకి వదిలారు. పది రోజులుగా గేట్ల ద్వారా సముద్రంలోకి గోదావరి జిల్లాలో వృథాగా పోతున్నప్పటికీ ఎస్సారెస్పీ కింద ఉన్నటువంటి ప్రాజెక్టులను నింపడంలో ఆలస్యం చేసి నీటి విడుదలలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మకు నీరెత్తినట్లుగా..

ఎస్సారెస్పీ రెండో దశకు నీటి విడుదల విషయంలో ఇటు అధికార యంత్రాంగం అటు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఈ ప్రాంత రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఇరిగేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు .. సాగునీటిని అందించాలన్న చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నట్లు రైతులు చర్చించుకుంటున్నారు. గతంలో రెండు పంటలకు ఎలాంటి ఢోకా లేకుండా నీళ్లు ఇచ్చినప్పుడు ఇప్పుడు నీళ్ల ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టుల నుండి నీటిని వృథాగా సముద్రం పాలు చేసే బదులు ఆయకట్టుకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాల్సి ఉందని పేర్కొంటున్నారు. అసలు ఈ వానాకాలం సీజన్ ఆయకట్టులో పంటల సాగుకు నీటిని ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా లేదా అన్న విషయమై స్పష్టమైన ప్రకటన చేస్తే రైతులు సాగునీటి కోసం ఎదురు చూడకుండా ఉంటారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై జిల్లా ఇరిగేషన్ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు.

నీళ్లు వస్తాయని ఎదురుచూస్తున్నాం



ఈ వానాకాలం ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి సమృద్ధిగా నీళ్ల రావడంతో మా పంటలకు నీటిని వదులుతారని ఆశతో ఉన్నాం. పది రోజులుగా నీటి కోసం ఎదురుచూస్తున్నా విడుదల చేయడం లేదు. అసలు నీళ్ల వస్తాయా రావా అన్న విషయం తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి.
– తోట ఉపేందర్, రైతు, కొత్తగూడెం, తుంగతుర్తి మండలం

ఆయకట్టుకు నీటిని అందించాలి



గత ఏడాది నుంచి ఎస్సారెస్పీ రెండవ దశ ఆయకట్టుకు సరిగా నీటిని ప్రభుత్వం విడుదల చేయడం లేదు. రెండు పంటలకు కాదు కదా కనీసం వానాకాలం కూడా నీటిని ఇచ్చే పరిస్థితి లేదు. ఈ ఏడాది ఆలస్యంగా నైనా ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిండింది. వెంటనే ఆయకట్టుకు నీటిని అందిస్తే ఒక్క వానకాలమైన రైతులు పంటలు పండించుకుంటారు. ఈ విషయమై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వెంటనే నీటిని విడుదల చేయాలి.
– కదపర్తి శీను, ఆత్మకూరు ఎస్

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 99489 38922

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ సూచించారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్న బీసీ బాలుర గురుకుల పాఠశాలకు కోహెన్స్ స్వచ్ఛం సంస్థ ఆధ్వర్యంలో రూ.12 లక్షల విలువైన డ్యూయల్ డెస్క్ బెంచీలు పాఠశాలకు అందజేశారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. పాఠశాలలో ఈ సంవత్సరం టాయిలెట్స్, పైపులైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసిందని, టెక్నికల అనుమతులు రాగానే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలన్నదే తమ ధ్యేయమన్నారు. పాఠశాలలో పైపులైన్ కోసం రూ.2లక్షల విలువైన పైపులు అందించిన పీవీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్పెడ్ ఇండియా వ్యవస్థాపకుడు శ్రీధర్ రెడ్డి, ఆర్‌సీఓ విద్యారాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో రమేష్ రెడ్డి

వారం రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరించాలి

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని శాఖల్లో ఎక్కువ రోజులు ప్రజా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, అలాంటి శాఖల అధికారులు వారం రోజుల్లో పెండింగ్ ఫిర్యాదులు అన్నింటినీ పరిష్కరించాలన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకొని సూర్యాపేట కలెక్టరేట్‌లో అవగాహన కల్పించారు. మట్టి వినాయకుల వినియోగంపై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీఓ అప్పారావు, సీపీఓ కిషన్, డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, డీపీఓ యాదగిరి, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్

చివ్వెంల(సూర్యాపేట) : వచ్చే నెల 13న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ తెలిపారు. లోక్ అదాలత్‌పై సోమవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీనియర్, జూనియర్ న్యాయవాదుల ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేవిధంగా సహకరించాలన్నారు. లోక్ అదాలత్ లో రాజీపడేవిధంగా కక్షిదారులకు సూచనలు చేయాలన్నారు. దీని వల్ల ఇరుగు వర్గాల వారు గెలిచిన వారవుతన్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

మా భూముల్లో అగ్రికల్చర్ కాలేజీ నిర్మించొద్దు

- కలెక్టరేట్ ఎదుట హుజూర్‌నగర్ రైతుల ఆందోళన

భానుపురి (సూర్యాపేట) : అగ్రికల్చర్ కళాశాలను తమ భూముల్లో నిర్మించి అన్యాయం చేయొద్దని హుజూర్‌నగర్‌కు చెందిన బాధిత రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా హుజూర్‌నగర్‌లోని మగ్దూంనగర్ –ఎర్రగ్రట్టు గ్రామాల మధ్య ఉన్న సర్వేనంబర్ 1041లో దాదాపు 300 మంది రైతులు వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూములన్నీ తమ తాతలు, తండ్రుల నుంచి వస్తున్నాయన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ భూములకు పట్టాలు ఇవ్వడంతో సాగుకు యోగ్యంగా లేని వీటిని అనుకూలంగా చేసుకొని సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఎంతోమంది ఈ భూములను తమ ఆడబిడ్డలకు కట్న కానుకలుగా ఇచ్చారని, ఎవరికీ ఆపద వచ్చిన ఈ భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. ఇటీవల జిల్లాకు మంజూరైన అగ్రికల్చర్ కాలేజీని తమ భూముల్లో ఏర్పాటు చేసేందుకు ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే ఈ భూముల్లో అగ్రికల్చర్ కాలేజీ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, దేవర మల్లేశ్వరి, సైదులు, నారాయణ, లింగయ్య, వెంకటరెడ్డి, అరవింద్ రెడ్డి, కష్ణ, నరసింహారావు, ధన మూర్తి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత రైతులు

డిమాండ్లు నెరవేర్చకపోతే 1న 'చలో అసెంబ్లీ'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

భానుపురి (సూర్యాపేట) : ఈనెల చివరి నాటికి ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోతే సెప్టెంబర్ ఒకటవ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు ఏక లక్ష్మి వెల్లడించారు.సోమవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీ మేరకు రూ. 18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు వాని, నాగమ్మ, వెంకటమ్మ, నరసమ్మ, జ్ఞానసుందరి, పద్మ, కలమ్మ, లక్ష్మీబాయి, సుశీలత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు



నడిగూడెం: ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



నడిగూడెం: పీఏసీఎస్‌లో గుమిగూడిన రైతులు

నడిగూడెం : వానాకాలం పంటల సాగు ఊపందుకోవడంతో రైతులు యూరియా కోసం నానా తంటాలు పడుతున్నారు. యూరియా కొనుగోలు కోసం పీఏసీఎస్‌ల వద్ద ఉదయం నుంచే బారులుదీరినా సరిపడా సరఫరా కాక చాలా మంది రైతులు వెనుదిరగాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు రైతులు ఆందోళన బాటపడుతున్నారు.

రాస్తారోకో..

నడిగూడెం సహకార సంఘానికి మొత్తం 222 యూరియా బస్తాలు రాగా ఒక్కో రైతుకు ఒకటి నుంచి రెండు బస్తాలు పంపిణీ చేశారు. ఇంకా పలువురు రైతులు 5 నుంచి 10 కట్టలు కావాలని అడిగారు. దీంతో సంబంధిత అధికారులు నానో యూరియా ఉందని, దానిని తీసుకోవాలన్నారు. దీంతో రైతులు రాస్తారోకో చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు కావాల్సిన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాగా మండల వ్యవసాయాధికారి రాయపు దేవ ప్రసాద్ హామీనివ్వడంతో రాస్తారోకోను విరమించారు.

పీఏసీఎస్ వద్ద ఎగబడిన రైతులు

మునగాల: మునగాల మండలంలోని మునగాల, కొక్కిరేణి సొసైటీలకు 20టన్నుల చొప్పున, ఆకుపాముల, తాడువాయి సొసైటీలకు పది టన్నుల చొప్పున 60టన్నుల యూరియా దిగుమతి కావడంతో ఆయా సొసైటీల వద్ద రైతాంగం కోసం ఎగబడ్డారు. దీంతో మండల వ్యవసాయాధికారి బుంగా రాజు నేతృత్వంలో ఆయా సొసైటీల వద్ద వ్యవసాయ విస్తరణాధికారుల సహకారంతో ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేయించారు. దీంతో ఆయా సొసైటీలలో గంటల వ్యవధిలోనే పంపిణీ పూర్తయింది. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతమైన మునగాల మండలంలో వరినాట్లు పూర్తయి మొదటి విడత యూరియా వేసే సమయం ఆసన్నం కావడంతో రైతాంగం వెంపర్లాడుతున్నారు . తమకు సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



మునగాల: పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

క్లుప్తంగా

ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా వేనేపల్లి శృతి


వేనేపల్లి శృతి

కోదాడ: కోదాడకు చెందిన వేనేపల్లి శృతి ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ (ఐడబ్ల్యూఎల్‌ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా నియమితులయ్యారు. సోమవారం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమెను జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా నియమించినట్లు ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సహదేవన్ ప్రకటించారు. ప్రస్తు తం శృతి ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ తెలంగాణ శాఖ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

ఎయిమ్స్‌లో ఉద్యోగాల పేరిట మోసాలు

- అప్రమత్తంగా ఉండాలని సూచించిన డిప్యూటీ డైరెక్టర్


మాట్లాడుతున్న బీబీనగర్ ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎయిమ్స్ పేరిట నకిలీ ఈమెయిల్ ఐడీలు, వెబ్‌సైట్‌లు సృష్టిస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బుల కోసం అక్రమార్కులు మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఎయిమ్స్‌లో రెగ్యులర్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పారదర్శకంగా నియామకాలు జరుగుతాయని.. ఏజెన్సీలు, వ్యక్తుల ద్వారా నియామకాలు జరగవని సూచించారు. మోసాలకు పాల్పడే వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

మట్టి గణపతికి జై..

- కోదాడలో మట్టి గణపతులు తయారుచేస్తున్న రెండు కుటుంబాలు
- ఆయా మండలాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్న భక్తులు


మట్టి గణపతులకు తుది మెరుగులు దిద్దుతున్న తయారీదారుడు

కోదాడ: వినాయక చవితి సమీపిస్తున్న తరుణంలో ఈసారి పర్యావరణహితంగా తయారుచేసిన మట్టి గణపతులను ప్రతిష్ఠించడానికి భక్తులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కోదాడ పట్టణానికి చెందిన రెండు కుటుంబాలు స్థానికంగా గత పది సంవత్సరాలుగా మట్టి గణపతులను తయారుచేస్తూ పర్యావరణ ప్రేమికుల మన్ననలు పొందుతున్నారు. గతంలో ఈ రెండు కుటుంబాల వారు వడ్రంగి పనిచేసేవారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులతో పాటు వర్కర్లను పెట్టుకుని పట్టణంలోని శ్రీనివాసనగర్, రాంమూర్తినగర్‌లో ఏర్పాటు చేసిన తయారీ కేంద్రాల్లో బంకమట్టి, పుట్టమన్నుతో ఒక అడుగు నుంచి 10 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసిన గంటలోపే పూర్తిగా కరిగిపోతాయని, నీటిలో ఉండే జలచరాలకు ఎలాంటి ముప్పు ఉండదని తయారీదారులు చెబుతున్నారు. సూర్యాపేట జిల్లా నలుమూలల నుంచి భక్తులు కోదాడకు వచ్చి ఈ మట్టి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. విగ్రహాల ధరలు కూడా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పోల్చితే తక్కువగా ఉన్నట్లు భక్తులు చెబుతున్నారు.

మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి

భక్తులు పర్యావరణహితంగా ఉండే మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి. గతంలో మట్టి విగ్రహాలు దొరికేవి కావు. ప్రస్తుతం తక్కువ ధరలో కావాల్సిన ఎత్తులో మట్టి విగ్రహాలు స్థానికంగానే దొరుకుతున్నాయి. ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి. – కొల్లు లక్ష్మీనారాయణ, పర్యావరణ ఉద్యమకారుడు

నాయకుల హడావుడి..

త్వరలో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పలువురు రాజకీయ నేతలు యువతను ప్రసన్నం చేసుకోవడానికి వినాయక చవితిని ఉపయోగించుకుంటున్నారు. విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద వీరి హడావుడి ఎక్కువగా కనిపిస్తోంది. యువకులకు సొంత ఖర్చులతో విగ్రహాలను ఇప్పిస్తున్నారు. దీంతో తయారీదారులు ఈసారి విగ్రహాల రేట్లను పెంచారు. గతంలో కన్నా ఈసారి విగ్రహాలు ఎక్కువగానే ఉండే అవకాశం కనిపిస్తోంది.

బంగారు నాణేలు ఇస్తామంటూ టోకరా

- వ్యాపారి వద్ద రూ.20లక్షలు స్వాహా చేసిన ముఠా
- 9 మందిపై కేసు నమోదు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

చివ్వెంల(సూర్యాపేట): పురాతన బంగారు నాణేలను తక్కువ ధరకు విక్రయిస్తామని ఓ వ్యాపారికి టోకరా పెట్టిన ముఠా సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సోమవారం సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ విలేకరులకు వెల్లడించారు. చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని తెల్లబండ కాలనీకి చెందిన పసుపులేటి గణేష్, ఓర్సు చంటి, ముద్దంగుల వెంకన్న, పసుపుల సత్యం, పసుపుల నవీన్, ఓర్సు శ్రీను, ఓర్సు గోపమ్మ, పసుపుల లక్ష్మి, ముద్దంగుల అంజలి ముఠాగా ఏర్పడి సూర్యాపేటకు చెందిన వ్యాపారి నిమ్మనగోటి వెంకటేశ్వర్లుకు పురాతన బంగారు నాణేలు తక్కువ ధరకు విక్రయిస్తామని నమ్మబలికారు. దీంతో వెంకటేశ్వర్లు ఈ నెల 10న రూ.5లక్షలు, 11న రూ.15లక్షలు వారికి చెల్లించాడు. అనంతరం బంగారు నాణేల గురించి అడగగా.. రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తుండడంతో అనుమానం వచ్చిన వెంకటేశ్వర్లు తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వాలని కోరాడు. కాగా అప్పటికే వెంకటేశ్వర్లు నుంచి వసూలు చేసిన డబ్బుల్లో నుంచి పసుపుల గణేష్ రూ.12.50 లక్షలు, ఓర్సు చంటి రూ.6లక్షలు, ముద్దంగుల వెంకన్న రూ.లక్ష, పసుపుల సత్యం రూ.50వేలు పంచుకున్నారు. నగదు తిరిగి ఇవ్వకపోగా.. గుర్తుతెలియని వ్యక్తులు తమను కొట్టి నగదు దోచుకెళ్లారంటూ ఓ వీడియో తీసి వెంకటేశ్వర్లు సెల్‌ఫోన్‌కు పంపించారు. దీంతో వెంకటేశ్వర్లు ఈ నెల 21న చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మోసానికి పాల్పడిన పసుపుల గణేష్ నుంచి రూ.9.80 లక్షలు, చంటి నుంచి రూ.3.20 లక్షలు వెంకన్న నుంచి రూ.25 వేలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిలో అంజలి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ మహేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వసూల్ రాజాపై ఆర్డీఓ విచారణ

- టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆగ్రహం

మోత్కూరు: 'మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో వసూల్ రాజా' శీర్షికన సోమవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనంపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం బాధితులు బాసోజు అంజయ్యచారి, గంట శ్రీనివాస్‌రెడ్డి వాంగ్మూలాన్ని ఆర్డీఓ స్వీకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆర్డీఓ విలేకరులకు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్‌ఐ సుమన్ ఉన్నారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్ల దందాపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తహసీల్దార్లను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు.

బిహార్ యువకుడి వద్ద గంజాయి పట్టివేత


నిందితుడు మిథున్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి: భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడి వద్ద పోలీసులు గంజాయి పట్టుకున్నారు. పోచంపల్లి పట్టణ కేంద్ర పరిధిలోని అయ్యప్ప గుడి సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని పట్టుకొని విచారించారు. అతడి వద్ద నుంచి 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి బిహార్ రాష్ట్రం సహస్ర జిల్లా పరారియా మండలం బారాహి తొలసుకసాని గ్రామానికి చెందిన తంటి మిథున్‌కుమార్‌గా పోలీసులు గుర్తించారు. మిథున్‌కుమార్‌తో పాటు పలువురు బిహార్ రాష్ట్రానికి చెందిన యువకులు పని నిమిత్తం 6 నెలల క్రితం పోచంపల్లికి వచ్చి స్థానికంగా సెంట్రింగ్ పనిచేస్తున్నారని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. తన తోటి కూలీలకు విక్రయించేందుకు గంజాయి తీసుకొచ్చినట్లు మిథున్‌కుమార్ నిజం ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బిల్లులు విడుదల చేయాలని కాంట్రాక్టర్ ధర్నా


భార్యాపిల్లలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాగపురి కృష్ణ

భువనగిరిటౌన్ : భువనగిరి మండలంలోని హన్మాపురం, తాజ్‌పూర్ గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.42లక్షల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ నాగపురి కృష్ణ తన భార్య, కుమారులతో కలిసి సోమవారం భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టాడు. రెండు సంవత్సరాల నుంచి తాను చేసిన పనులకు సంబంధించి రావలసిన రూ.42 లక్షలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని చెప్పాడు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో మానసిక క్షోభకు గురవుతున్నట్లు పేర్కొన్నాడు. ఆర్థిక ఇబ్బందులు అప్పుల బాధతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొందని పెండింగ్ బిల్లులు విడుదల కాకపోతే తనకు మరణమే శరణ్యమని కంటనీరు పెట్టుకున్నాడు. 2023లో అప్పటి ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ.8 లక్షలతో కమ్యూనిటీ హాల్, రూ.5లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, రూ.8లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను చేపట్టినట్లు కృష్ణ చెప్పాడు. తన దీక్ష మంగళవారం కూడా కొనసాగుతుందని తెలిపాడు.

ఎయిమ్స్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- బీఆర్‌ఎస్ నాయకుల నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో పట్టణవాసులకు ఉద్యోగవకాశాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఎయిమ్స్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకొని దీక్షను విరమించాలని నచ్చజెప్పడంతో నాయకులు ఎయిమ్స్ అధికారులను కలిసి ఉద్యోగవకాశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్లగారి శ్రీనివాస్, పిట్టల అశోక్, గోలి సంతోష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఖాజా మోయినుద్దీన్, అమృతం, శ్రీనివాస్, పరంకుశం తదితరులు పాల్గొన్నారు.

కెనడాలోని టొరంటోలో యాదగిరీశుడి కల్యాణం


టొరంటోలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: కెనడా దేశంలోని టొరంటో నగరంలో ఆదివారం రాత్రి యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ వేడుకను ఆలయ రిటైర్డ్ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, ఆలయాధికారి గజివెల్లి రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి కల్యాణ వేడుకను జరిపించారు. ఈ వేడుకల్లో తెలంగాణ కెనడా అసోసియేషన్ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు కేంద్రంగా భువనగిరి

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి: అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు భువనగిరి కేంద్రంగా మారడం సంతోషించదగ్గ విషయమని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్‌లో జిల్లా టెన్నిస్ అసోసియేషన్, న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజా నర్సింహారావు స్మారక ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం అండర్–18 విభాగంలో బాలబాలికలకు నిర్వహించిన పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న భువనగిరి పట్టణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో టెన్నిస్ స్టేడియాలను ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. వివిధ దేశాల క్రీడాకారులు భువనగిరి జిల్లా కేంద్రానికి వచ్చి అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనడంతో భువనగిరి పేరు ప్రపంచ స్థాయికి వెళ్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడా రంగానికి, క్రీడాకారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ఈవెంట్లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులు ఇలాంటి ఈవెంట్లలో పాల్గొని గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దిడ్డి బాలాజీ, కార్యదర్శి కలీం అహ్మద్, సంయుక్త కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద


26గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్‌కు వచ్చే వరద తగ్గుముఖం పడుతోంది. నాగార్జునసాగర్ జలాశయానికి 2,90,239 క్యూసెక్కులు వస్తుండగా 2,50,169 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 585.10 అడుగులు (297.7235 టీఎంసీలు) ఉంది. ఎగువ నుంచి వచ్చే వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను నెమ్మదిగా కిందికి దింపుతున్నారు. ప్రస్తుతం 26గేట్లు ఐదు అడుగులెత్తి స్పిల్‌వే మీదుగా 1,96,742 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,739 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం కేతేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులు ఎరువులు, విత్తనాల కోసం ఏనాడూ ఇబ్బందులు పడలేదన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే యూరియా అవసరాన్ని అంచనా వేసి సిద్ధ చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. రైతులు యూరియా కోసం చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్రానికి సరిపడా యూరియా తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కె. ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సభ్యుడు బడుగుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చియట వెంకన్న, నాయకులు బంటు మహేందర్, బొప్పని సురేష్, కె. సైదిరెడ్డి, ఆర్. సైదులు, దండు వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య

కట్టంగూర్: కుటుంబ పోషణకు ఆసరాగా ఉండమని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని అక్కలాయిగూడెంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కలాయిగూడేనికి చెందిన ఊట్కూరి ముత్తయ్య, మంజుల దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. రెండో కుమారుడు బన్ని(21) డ్రైవర్‌గా, కూలీ పనులు చేస్తూ ఉండేవాడు. కొంతకాలంగా ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో దివ్యాంగుడైన తండ్రి ముత్తయ్య ఇల్లు గడవటం కష్టంగా మారటంతో బన్నిని కుటంబ పోషణను ఆసరాగా ఉండమని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన బన్ని సోమవారం తెల్లవారుజామున డోర్ కర్టెన్‌తో ఇంటి పక్కనే ఉన్న వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బన్ని తమ్ముడు చంటి ఉదయాన్నే లేచి చూసేసరికి బన్ని వేప చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

మరో పెళ్లికి అడ్డుగా ఉందని..

- భార్యను చంపిన భర్త
- నిందితుడి అరెస్ట్
- మృతురాలి పుట్టినిల్లు నూతనకల్ మండలం దిర్శనపల్లి

వరంగల్: మరో పెళ్లికి అడ్డుగా ఉందనే కారణంతో భార్య నిద్రిస్తున్న సమయంలో ఆమె ముఖంపై బెడ్‌షీట్ కప్పి ఊపిరాడకకుండా చేసి భర్త కిరాతకంగా హతమార్చాడు. ఈ ఘటన వరంగల్ నగరంలోని మట్టెవాడ పీఎస్ పరిధిలోని హంటర్ రోడ్డులో ఆదివారం జరిగింది. ఘటన జరిగిన 24 గంటల్లోనే పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను వరంగల్ ఏఎస్పీ శుభం నాగ్రాలే వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం దిర్శనపల్లి గ్రామానికి చెందిన బాదావత్ అశోక్ కూతురు గౌతమి(22)కి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్యతండాకు చెందిన బానోత్ గణేశ్‌తో ఈ ఏడాది మేలో వివాహం జరిగింది. గణేశ్‌కు కట్నం కింద రూ.2.5 లక్షల నగదు, రెండు తులాల బంగారం, 150 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి వివాహం జరిపించారు. గణేశ్ ఆటో నడుపుకుంటూ హంటర్ రోడ్డులోని పద్మావతి ఫంక్షన్‌హాల్ సమీపంలో అద్దెకుంటున్నాడు. పెళ్లి అనంతరం నెల రోజుల వరకు బాగానే ఉన్న గణేశ్.. అదనపు కట్నం కావాలని భార్య గౌతమిని వేధించసాగాడు. దీంతో గౌతమి తండ్రి అశోక్ రూ.లక్ష ఇవ్వగా గణేశ్ ఆ డబ్బుతో ఆటో కొనుగోలు చేశాడు. ఆటో నడపగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో డబ్బులు సరిపోవడం లేదంటూ గౌతమిని ఇబ్బందులకు గురిచేయడంతో మళ్లీ రూ.లక్ష ఇవ్వగా ఆ డబ్బులతో మేకలు కొనుగోలు చేసి స్వగ్రామంలో తండ్రికి అప్పగించాడు. అప్పటి కూడా భార్యతో సక్రమంగా ఉండడం లేదు. ఈ క్రమంలో తనతో కలిసి పదో తరగతి చదువుకున్న యువతితో పరిచయం కావడంతో ఆమెను పెళ్లిని చేసుకోవాలని నిర్ణయించుకుని, భార్య గౌతమిని చంపాలని నిర్ణయించుకున్నాడు. శనివారం అర్ధరాత్రి గౌతమి నిద్రిస్తుండగా ఆమె ముఖంపై బెడ్‌షీట్ బిగించి ఊపిరి ఆడకుండా చేసి చంపాడు. అనంతరం ఏమీ తెలియనట్లు నటిస్తూ గౌతమి ఎంత పిలిచినా పలకడం లేదని తన ఇంటి పక్కన ఉంటున్న పెద్దమ్మ కొడుకు కుమార్‌కు చెప్పాడు. కుమార్ దంపతులు వచ్చి చూసి గౌతమిని 108 వాహనంలో ఎంజీఎంకు తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన తర్వాత గణేశ్ తప్పించుకుని తిరుగుతుండగా.. గౌతమి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం వరంగల్ చౌరస్తా వద్ద పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.